# ఓబ్బా! నీకు సిగ్గులేదు

బి. జ్యోతి

నువ్వేమీ అనలేదు కామాక్షీ. ఏమిటి ఆలోచించావు? అతనికి ఉత్తరం రాయాలి. అమ్మాయిని కూడా అడిగాం కదా. ఏదో ఒకటి తేల్చేస్తే సరి." రాఘవరావుగారి మాటలకి కూర ముక్కలు గిన్నెలో వడేస్తూ, ఆ ఘాటుకి దగ్గుతూ కొంతసేపు సమాధానం చెప్పకుండా తప్పించుకుంది కామాక్షమ్మ. ఆ హడావుడి అయ్యాక నిష్ఠూరంగా "అదే కానివ్వండి మరి. ఏం చేస్తాం? నేను మాత్రం అనే దేముంది?" అంది.

"అంతలా అనకు మరి. నేన్ను మాత్రం సంతోషంగా ఒప్పుకుంటున్నానా? పరిస్థితులు అలా ఉన్నాయి."

మధ్యలోనే అందుకుని ముక్కు చీదేస్తూ, "అలా అని ఎంత సర్ది చెప్పుకున్నా వెధవది గుండె చెరు వయిపోతోంది. మన కడుపున పుట్టినందుకు దానికి అంతకన్నా ఏమీ చెయ్యలేకపోతున్నాము" అంది.

"ఊరుకో కామాక్షీ. మొదటి సంబంధం అయితే మాత్రం ఇంకొక నాలు గైదేళ్ళు చిన్నవాడిని తేగల మేమో. అంతే కదా. మరి మన అమ్మాయిని చదివించకుండా పెళ్ళి చేస్తే ఈ పాటికి ఇద్దరు పిల్లలు ఉండరూ? అలాగే అనుకోవాలి మరి. రెండో సంబధం అన్న పేరుకే గాని, కుర్రాడు లక్షణంగా ఉన్నాడు. మంచివాడు"

"'సరేలెండి. అలా నచ్చచెప్పుకోవా లనుకుంటే ఎంతన్నా చెప్పచ్చు. మన అవసరం కదా" అని, జయ స్నానం చేసి లోపలికి వస్తుంటే మాటలు ఆపేసింది.

"తల్లీ! ఒకసారి ఇలా రామ్మా" అంటూ కూతుర్ని తనతో తీసుకెళ్ళారు.

వెళ్తున్న వాళ్ళని చూసి కళ్ళు ఒత్తుకుంది కామాక్షమ్మ.

తండ్రి మాటలు విని- "కానివ్వండి నాన్నా. అంత బాధపడతా రేమిటి మీరు? ఫర్వాలేదు. నేను ఒప్పుకుంటున్నాను కదా. అందరూ రెండో సంబంధం చేస్తున్నారని అంటారని అలా దిగులు పడకండి. రే ప్పొద్దున్న అన్నీ బాగుంటే వాళ్ళే ఊరుకుంటారు. ఇంకొకళ్ళ కోసమని మన పనులు మానుకుంటామా నాన్నా?" అంటున్న కూతుర్ని చూసి, "పిచ్చి తల్లీ! ఈ నాన్న ఎక్కడ బాధపడిపోతా డే నని చిన్నదానివి నువ్వు నాకు ధైర్యం చెపుతున్నావు. నీ మంచితనమే నీకు అదృష్టాన్ని తెచ్చిపెడుతుంది. సరే ఇవాళ ఉత్తరం రాస్తాను మరి" అంటూ లేచారు.

ముగ్గురు ఆడపిల్లలు. తర్వాత ఒక్క మగపిల్లవాడు రాఘవరావుగారి సంతానం. తండ్రి ఇచ్చిన పాత ఇల్లు ఉంది. దాంతోటే ఆడపిల్లల పెళ్ళి కని చేసిన కొంత అప్పు కూడా మిగిలింది. ఇల్లు అమ్ముకుంటే మళ్ళీ కొనడ మంటూ ఇంక కుదరదని మిగతా ఇబ్బంది లన్నీ పడుతూ అప్పు లన్నీ తీర్చారు. అదంతా అయి తల ఎత్తేసరికి ముగ్గురు ఆడపిల్లలు క్యూలో నిలబడ్డారు ఎదిగిపోయి. మళ్ళీ కొత్త అప్పులు చెయ్యకుండా గుట్టుగా సంసారం లాక్కు రావడం విశేషమే అయినా ఆడపిల్లల పెళ్ళిళ్ళు సమస్య అయిపోయింది. పెద్ద పిల్ల జయ బి.ఎ. పాసయి ఇంట్లోనే ఉంది. సంబంధాలు చూస్తూ ఏళ్ళు గడిచిపోతున్నాయి. ఆఖరికి ఎంత వద్దనుకున్నా ఈ రెండో పెళ్ళి సంబంధమే కుదిరేటట్లు ఉంది.

పెళ్ళికొడుకు రాధాకృష్ణ భార్య రెండో కాన్పులో పోయింది. కొన్నాళ్ళ దాకా అతను తేరుకోలేకపోయాడు. పిల్లలు అమ్మమ్మ ఇంట్లో పెరుగుతున్నారు. అతను ఒక్కడే ఉద్యోగరీత్యా ఊళ్ళు తిరుగుతూ ఉంటాడు. ఇన్నాళ్ళూ మళ్ళీ పెళ్ళి ప్రస్తావన తేలేదు గాని, ఈ మధ్య పిల్లల్ని తన దగ్గర ఉంచుకోవాలన్న కోరిక బలంగా పట్టుకుంది. మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పేటట్టు లేదు, పిల్లల కోస మయినా నెమ్మదిగా అక్కడా, ఇక్కడా వాకబు చేశాడు. మరీ చిన్నపిల్ల కాకుండా కాస్త చదువుకుని, నలుగురిలో మసల గలిగి, కష్టం సుఖం తెలిసిన పిల్ల కావాలి. కట్నం దగ్గర ఎన్నో సంబంధాలు తప్పిపోయిన జయ కోసం ఈ సంబంధం చెప్పారు ఎవరో. ఎంతో ఆలోచించిన మీదట అటువైపే మొగ్గారు.

ప్రత్యేకం పిల్లని చూడాలన్న ఆసక్తి లేకపోయినా అవతలవాళ్ళకి తనని చూడాలన్న కుతూహలం ఉంటుందన్న ఉద్దేశంతో తెలిసినవాళ్ళ ఇంట్లో దిగాడు రాధాకృష్ణ. రాఘవరావుగావు జయని తీసుకెళ్ళి చూపించారు. నిజానికి రాధాకృష్ణ మనిషి బాగుంటాడు. కొంతలో కొంత తేలికగా అనిపించింది గానీ, రెండో పెళ్ళివాడు, పిల్లలవాడు అని మనసు కులుక్కు మంటూనే ఉంది. వెళ్ళగానే జయ నచ్చిందని ఉత్తరం రాశాడు రాధాకృష్ణ.

ఈ రోజు పూర్తిగా జయ అంగీకారంతో అతనికి ఇక ఏ శంకలూ పెట్టుకోకుండా సమాధానం రాసి పడేశారు రాఘవరావుగారు. ముహూర్తాలు పెట్టుకున్నారు.

అట్టహాసం లేకుండా నిరాడంబరంగా చేయించమన్నాడు రాధాకృష్ణ. మరీ విరగబడి అందరికీ చెప్పుకోవడం కామాక్షమ్మకీ ఇష్టం లేదు.

"ఎందుకులెండి అంత హడావుడి? ఏదో ఒకటి అంటూంటారు జనం ఊరుకోకుండా. మనసుకి కష్టం తోస్తుంది" అంది. నిజానికి అంతకన్నా ఎక్కువగా చేసే తాహతు కూడా లేదు.

మరీ దగ్గర చుట్టాలు, ఎన్నో ఏళ్ళ నుంచీ చుట్టుపక్కల తెలిసినవాళ్ళని పిలిచి జరిపించారు. జయ అమ్మా, నాన్నలు బాధపడకుండా అన్నీ సంతోషంగానే జరిపించుకుంది.

రాధాకృష్ణ పెళ్ళికూతురికి నాలుగు పట్టుచీరలు, రెండు జతల గాజులు, గొలుసు తెచ్చాడు. కట్నం తీసుకోకుండా.

కామాక్షమ్మ సంతోషించింది.

"మరీ నాసిగా కాకుండా లక్షణంగానే చేశాడు అన్నీ" అని మురిసిపోయింది.



వచ్చినవాళ్ళు ఊరికే ఉండకుండా, "బాగుంది మరి. పిల్లలు ఎక్కడో పెరుగుతున్నారు. సంపాదిస్తున్న దంతా బోల్డు ఉండీ ఉంటుంది. ఆ మాత్రం చీరలు కొనలే డేమిటి దాంట్లో ఏం గొప్ప? మొదటి ఆవిడది బంగారం ఉండే ఉంటుంది. మరీ అవే పెడితే బాగుండదని చెరిపించో, మెరుగు పెట్టించో తెచ్చి ఉంటాడు" అంటున్న మాట లన్నీ అవు డవుడు చెవిన పడుతూనే ఉన్నాయి.

మామగారి మాట కాదనకుండా మూడు రోజులు అక్కడ ఉన్నాడు రాధాకృష్ణ. రెండో రోజు ఉదయం కూతురి మొహం చూసి సంతృప్తిపడింది కామాక్షమ్మ

భర్తతో వెడుతూ, "ను వ్వేమీ బెంగపడకమ్మా. చూశావు గదా ఈ మూడు రోజులూ. ఆయన చాలా మంచివారు. నేను అదృష్టవంతురాలినే అనుకో. నాన్నగారితో ఇక ఏమీ నిష్ఠూరం మాటలు అనకు తెలిసిందా?" అంటూ తల్లికి నచ్చచెప్పి వెళ్ళింది జయ. పిల్లలు ఉన్న ఊరు వెళ్ళి వాళ్ళని తీసుకుని అక్కడనుంచి ఉద్యోగపు ఊరికి వెడుతున్నారు ఇద్దరూ.

కూతురి దగ్గర్నుంచి మొదటి ఉత్తరం చూసుకుని సంతోషించారు. పిల్లలు అలవా టయిపోతున్నారని రాసింది. "పోనీలెండి. తల్లి లేని పిల్లలని చూసుకుంటోంది" అని నచ్చచెప్పుకుంది కామాక్షమ్మ.

మొదటిసారి పండగకి రమ్మని' రాస్తే "ఇంకోసారి ఎపు డన్నా వస్తాము" అని రాశాడు రాధాకృష్ణ.

అల్లుడు మొహమాటపడుతున్నాడని తెలిసి రాఘవరావుగారు కూతుర్ని చూడాలన్న కోరిక కూడా మనసులో పీకుతుంటే తనే ప్రయాణ మయ్యారు.

"చూడు బాబూ. మామూలుగా అయితే మీ అత్తవా రింటికి పండగ కని వెళ్ళవా చెప్పు. అంతే అనుకో. మాకూ ముచ్చట తీరుతుంది. మొదటి పండగ అని నే నేమీ ఆర్భాటం చెయ్యడంలేదు. ఊరికనే వచ్చి నాలుగు రోజులు సరదాగా ఉండండి అంతే. వాళ్ళ అమ్మ కూడా దాన్ని చూడాలని అనుకుంటోంది" అన్నారు.

గుమ్మంలోకి వచ్చిన మామగారి మాటలు కాదనలేకపోయాడు. అదీగాక జయకి కూడా సరదా ఉంటుంది కదా అని ఒప్పుకున్నాడు. ఉన్న రెండు రోజులు పిల్లలు "తాతగారు" అంటూ ఆయన్ని వదలలేదు. ఎవరో పరాయి పిల్లల్లా అనిపించలేదు ఆయనకి కూడా.

మనసులు నిర్మలంగా ఉంటే జీవితాలు కూడా హాయిగా గడిచిపోతాయి. అలాకాక ఎవరి పిల్లలో మన కెందుకని విసిరికొడితే మనసులు విరిగి మనుష్యుల మధ్య దూరాలు పెరుగుతాయి.

పిల్లల్ని అమ్మమ్మ ఇంట్లో నాలుగు రోజులు వదిలి రాధాకృష్ణ, జయ వచ్చారు. తల్లి వెనకాతల సాయం చేస్తూ తిరిగింది జయ. కూతురు సుఖంగా ఉందన్న నమ్మకం ఏర్పడిపోయింది ఆవిడకి. కాకపోతే కూతురు సంసారం గురించి గొప్పగా చెప్పుకోడానికి అందరిలా కుదరడం లేదని ఆవిడకి బాధగా ఉంటుంది. ఏం చెప్పినా, 'ఆ రెండో సంబంధం గురించి ఏం గొప్పలు చెబుతోంది బాబూ' అంటారని ఆవిడకి భయం.

జయ స్నేహితురాళ్ళు పెళ్ళి ళ్ళయిం తర్వాత మొదటిసారి పుట్టింటికి వస్తే అంద రిళ్ళకీ తిరిగేవారు తమ కాపురం కబుర్లు చెపుతూ. జయ ఎక్కడికీ వెళ్ళలేదు. వాళ్ళు ఏదో అంటే మనసుకి కష్టం తోస్తుంది. "రెండో పెళ్ళివాడు కదా ని న్నెలా చూసుకుంటాడు? పిల్లల్ని నీ మీద నమ్మకంగా వదులుతాడా?" ఇలాంటివే ఏవో అంటారు. కొన్ని ప్రశ్నలు వాళ్ళు మంచి ఉద్దేశంతో వేసినా మన పరిస్థితుల్ని బట్టి వక్రంగా వినిపిస్తాయి. "ఎందు కొచ్చిన గొడవ. సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన పడేసుకోవడం?" అనుకుంది.

రాధాకృష్ణ ఒక రోజు పిల్ల లందర్నీ తీసుకుని సినిమాకి వెళ్ళి హొటల్లో భోజనం పెట్టించి తీసుకువచ్చాడు. అతని కలుపుగోలుతనంతో కాస్తా, కూస్తా ఉన్న అనుమానం కూడా తీరిపోయింది కామాక్షమ్మకి.

జయ వచ్చిందని తెలిసి చుట్టుపక్కలవాళ్ళు కొంతమంది రానే వచ్చారు. నాలుగు ప్రశ్నలు అడిగి అంతా సవ్యంగా ఉండటంతో - అది కొంతమందికి నచ్చలేదు కూడా.

"అంతా నాటకం లెద్దూ. పైకి తేలతా రేమిటి? రెండో సంబంధం రెండో సంబంధమే. అందులో పిల్లల తండ్రి. పొంగిన పాల లాంటివాడు. వేరే దారి లేక చేసుకున్నాక మరి సర్దుకుపోవాల్సిందే. మనకి చెప్తా రేమిటి? విప్పి పడేసిన చీర విప్పినదే. కొత్త చీర విలువ దానికి వస్తుం దేమిటి?"

రెండో కూతురు సుమతి తల్లితో చెప్పింది ఒక రోజు "మా ఫ్రెండ్ మాలతి వాళ్ళ ఇంట్లో చేరి అందరూ ఇలాంటి కబుర్లు చెప్పుకుంటున్నారట. తనే అంది ఈ అమ్మల కేం పనీ పాటు లేదు" అంటూ అని.

ఇటువంటి మాటలకి బాధపడటం మానేసింది కామాక్షమ్మ. అవకాశం దొరికితే ఎదుటివారిని ఎత్తి పొడవటానికి అందరూ తయారే. తనదాకా వస్తే గానీ ఎవరికీ ఆ కష్టం తెలిసిరాదు.

*** *** ***

సంధ్యవేళ. చీకటి కొంచెంగా పడుతున్న సమయం. ఆడపిల్ల లిద్దరూ ఎవరిదో పుట్టిన రోజంటూ బయటికి వెళ్ళారు. రాఘవరావుగారు



బజారుకి వెళ్ళారు. పిల్లవాడు బయట స్నేహితులతో ఆడుతున్నాడు. కామాక్షమ్మ వంట పూర్తిచేసి చాప పరుచుకుని నడుం వాల్చింది. కూతురు, అల్లుడు వెళ్ళాక ఇ ల్లంతా వెలితిగా ఉంది. ఆ నాలుగు రోజులూ పడ్డ హడావుడికి ఒళ్ళంతా అలసటగా కూడా ఉంది. కబుర్లతో నిద్ర కూడా పోలేదు సరిగ్గా. చేస్తుంటే తెలియలేదు గానీ, అంతా అయిపోయాక ఈ రోజు అలసటగా ఉంది.

మాగన్నుగా నిద్ర పడుతుంటే "అమ్మా అమ్మా!" అంటూ అరుస్తూ వచ్చిన కొడుకు కేకలకి ఉలిక్కిపడి లేచింది.

"ఏమిట్రా మళ్ళీ పడ్డావా? ఆ వెధవ ఆటలు వద్దంటే వినవు. చీకటి పడింది. రాళ్ళూ, రప్పలూ చూసుకోకుండా ఒకటే పరుగులు. ఎక్కడ తగిలింది?" అరిచింది విసుగ్గా.

"అబ్బ! నే నేం పడలేదు గానీ, చెప్పింది విను. మన లీ లక్కయ్యా వాళ్ళు లేరూ, వాళ్ళందరూ ఇప్పుడే కార్లో వచ్చారు."

"వస్తే ఏ మయిందిరా? పది రోజులై ఎక్కడికో వెళ్ళారు. కార్లో తిరిగి వచ్చుంటారు. నిద్ర పడుతుంటే ఈమాత్రం దానికా గావుకేకలు పెట్టి లేపించావు" అని ఊడిపోతున్న జుట్టు ముడి వేసుకుంటూ విసుక్కుంది.

"పూర్తిగా విను. అక్కయ్యా ఏమో పెద్ద పట్టుచీర కట్టుకుంది. ఇంకొక అతను ఎవరో కూడా ఉన్నారే. గేటు దగ్గర ఇద్దరికీ హారతి ఇచ్చి లోపలికి తీసుకెళ్ళారు."

కామాక్షమ్మ నోరు వెళ్ళబెట్టింది. "పోరా అన్నీ వెధవ కబుర్లు తీరిగ్గా కూర్చుని" అంది అపనమ్మకంగా.

"నా మాటలు నమ్మకపోతే పక్క సుధాకర్‌వాళ్ళ అమ్మని అడుగు. వాళ్ళూ చూశారు. నువ్వే నిద్రపోతున్నావు. అందరూ రోడ్డు మీద నిలబడి చూస్తున్నారు. లీలక్కయ్యా పెళ్ళి చేసుకుందంటున్నారు."

అప్పటికీ ఆవిడ కేం నమ్మకం కుదరలేదు. అంతలా ఎవరికీ చెప్పకుండా పెళ్ళి చేయాల్సిన కర్మ వాళ్ళ కేం పట్టింది?

"అమ్మా! ఆ వచ్చిన అతనికి నున్నగా బట్టతల ఉంది" అంటూ నవ్వాడు.

"ఇప్పటికి చెప్పినవి చాలు గానీ ఇంక పోయి చదువుకో. బట్టతలట. చీకట్లో కనిపించింది నీకు"

"ను వ్వేమీ నమ్మవు నేను చెప్పినవి. వీధి లైటులో నిగ నిగా చెంబులా మెరుస్తోంది" అని నవ్వుతూ వెళ్ళిపోయాడు.

కామాక్షమ్మకి అర్థం అయీ అవకుండా ఉంది.

లీల పక్కింటి మాధవరావు దంపతుల అమ్మాయి. ఇంకొక ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. బాగా ఉన్నవాళ్ళు. రాఘవరావుగారు ఏమీ బాగుచేసుకోలేకపోయినా వాళ్ళు మాత్రం పాత ఇంటిని కొని మేడ కట్టారు. కారు ఉంది. దానితోటి అన్ని రకాల హంగులూఉన్నాయి. దేశ మంతా తిరిగి వచ్చారు కాబట్టి పిల్లలు కూడా మంచి చురుగ్గా, మోడరన్‌గా ఉండేవారు. పక్క పక్క ఇళ్ళు అవడంతో పిల్లలూ, పెద్దలూ కూడా కలుపుగోలుగా ఉండేవారు. ఇన్నాళ్ళలో ఏనాడూ కూడా ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అన్న భావాలు రాలేదు. రాఘవరావుగారి పిల్లలు ఏనాడూ తమ ఆర్థిక ఇబ్బందుల్ని బయటికి చాటుకోలేదు. ఉన్నంతలోనే శుచిగా, శుభ్రంగా ఉండేవారు.

## లేవు

పిసినారి పావయ్య తన కొడుకు ఓ అమ్మాయితో షికారు కెళ్ళడం చూశాడు.

"ఏరా ఆ అమ్మాయి కోసం ఎంత ఖర్చు పెట్టావు?"

"ఇరవై"

"ఇరవై సరిపోయాయా?"

"ఏం చెయ్య మంటావు? అంతకన్నా ఎక్కువ ఆ అమ్మాయి దగ్గర లేవు."

జి. రామమూర్తి

[చిలకలూరిపేట]

కామాక్షమ్మ పిల్లల్ని అలా పెంచింది. ఎదుటివారి హోదా, గొప్ప చూసి ఏనాడూ వెకిలిగా ప్రవర్తించనూలేదు. తమ వెలితిని చాటుకోనూ లేదు. ఆ విధంగా వాళ్ళ కుటుంబాల మధ్య స్నేహం బాగానే నిలిచింది.

లీల బి.కామ్. పాసయి బాంక్ ఉద్యోగానికి సెలక్ట్ అయింది. వేరే ఊళ్ళో వేశారు. ఇంట్లోవాళ్ళు ముందర ఒప్పుకోకపోయినా పంతం పట్టి స్వతంత్రంగా ఉండాలంటూ వెళ్ళి చేరింది. ఒక్కర్తే ఉండేది. ఉన్న ఊరికి ట్రాన్స్‌ఫర్ చేపిస్తామన్నా "ఎప్పుడూ ఒకటే ఊరు, అమ్మా నాన్నల దగ్గర ఉండాలా, కాస్త మార్పు ఉండాలి. లేకపోతే నాకు బోర్" అంటూ అక్కడే ఉంటోంది.

ఆ పిల్లకి మొదటినుంచీ చొరవ, ధైర్యం ఎక్కువ. జయకి లీల కబుర్లు నచ్చినా విని ఊరుకునేది తప్ప అంత పట్టించుకునేది కాదు.

కామాక్షమ్మ కూడా మొదటినుంచీ కూడా- "స్నేహం, స్నేహం వరకే. వాళ్ళ పరిస్థితులు వేరు, మనవి వేరు" అంటూ హెచ్చరించేది.

ఈ రోజు కొడుకు నోటమ్మట ఈ మాటలు విని మళ్ళీ నిద్ర రాలేదు కామాక్షమ్మకి. 'వీధిలోకి వెళ్ళి చూద్దాం' అనుకుంది గానీ, 'ఎందుకు లెద్దూ. ఇక అందరూ తలో కబురూ చెప్తారు. అందరూ ఆడపిల్లలవాళ్ళమే. ఒకళ్ళ నెందుకు అనుకోవడం? అన్ని సంగతులూ అవే తెలుస్తాయి రెండు రోజులు పోతే' అనుకుని వంటింట్లోకి వెళ్ళింది.

అక్క లిద్దరూ రాగానే కుర్రాడు ఆ విషయం అంతా వర్ణించి చెప్పి నవ్వుతున్నాడు. "మీరూ ఇంట్లో ఉంటే బాగుండేది. చూసేవారు. అయినా ఎక్కడికి పోతారులే. రేపు చూద్దురు గానీ" అని సర్ది చెప్పాడు.

రాఘవరావుగారు ఆ మాటలు విని -"ఏమిటి వీడు అంటున్నది నిజమే?" అంటే "ఏమో! వీడి వెధవ కబుర్లు. ఏం చూశాడో ఏమో. రేపు తెలుస్తుంది లెండి" అంటూ సర్దేసింది కామాక్షమ్మ.

మర్నాడు పనిమనిషి ద్వారా ఇం టింటికీ కబురు అందిపోయింది.

"నిజమే నమ్మా. లీలమ్మగారు ఆ బట్టతలాయన్ని పెళ్ళి చేసుకున్నారట. అయ్యగారి పక్కన అన్నదమ్ముడిలా ఉన్నారు. ఇదేం చోద్యం తల్లీ? చక్కటి పిల్ల అలా ముసలాయన్ని చేసుకోవడ మేమిటి?" అని సాగదీసింది.

దాని చుట్టూ కూచుని ఆరాలు తీస్తున్న పిల్లల్ని కసిరి, "పోనీ లెద్దూ ఎవ రిష్టం వాళ్ళది. మన కెందుకు?" అని తప్పించుకుంది.

ఇంకా చాలా సమాచారం చెప్దామని ఉత్సాహంగా ఉన్న పనిమనిషి అలా అనేసరికి కోపం వచ్చి గిన్నెలు డమ డమ లాడించింది.

ఆ రో జంతా పక్కిల్లు హడావుడిగా ఉంది. మూడో రోజు ఉదయాన్నే లీల గాజులు గల గల లాడించుకుంటూ పెద్ద పట్టుచీరతో కామాక్షమ్మ ఇంటికి వచ్చింది.

ఆదివారం. తీరిగ్గా లేచి కాఫీలు కానిస్తున్నారు అప్పుడే. కామాక్షమ్మ పూజ ముగించుకుని వంట మొదలుపెడుతోంది.

"బాగున్నావా అత్తయ్యా?" అంటూ గాలిదుమారంలా వచ్చింది.

గొంతుక విని పిల్లలు బయటికి వచ్చారు. "హాయ్! సుమతీ. బాగున్నావా? అత్తయ్యా నా పెళ్ళి అయిపోయింది. అంతా సర్‌ప్రైజ్" అంటూ అక్కడ ఉన్న పీట వాల్చుకుని చతికిలపడింది.

"ఇవాళ సాయంత్రం పార్టీ ఉంది. నా ఫ్రెండ్స్ ఇళ్ళలో నేనే పిలుస్తానని బయలుదేరాను. తప్పకుండా రావాలి." గలగల మాట్లాడుతుంటే కామాక్షమ్మ, పిల్లలు బొమ్మల్లా నిలబడి చూస్తున్నారు. ఆవిడ తేరుకుని, "అదేమి టమ్మా! మా కెవ్వరికీ తెలియకుండా అలా చేశా వేమిటి?" ఏ మనాలో తెలియనట్టుగా అంది. బుర్రలో కుర్రాడు చెప్పిన బట్టతల మెదులుతుండగా.

"అదంతా ఒక పెద్ద కథ. నే నక్కడ బాంకులో పనిచేస్తుంటే ఈయనతో పరిచయ మయింది. అక్కడే దగ్గరలో ఒక ఫాక్టరీ పెట్టి, దానికి మా బాంక్ నుంచి లోను తీసుకున్నారు. అలా అస్తమానం రావలసి వచ్చి పరిచయం పెరిగింది. సడన్‌గా ఒక రోజు 'పెళ్ళి చేసుకుంటావా నన్ను' అని అడిగారు. ముందర ఏమిటోలా అనిపించింది. అమ్మా వాళ్ళూ ఏవో సంబంధాలు చూస్తున్నారు. అ వేవీ నాకు నచ్చలేదు అత్తయ్యా. ఆలోచించి సరేనని ఒప్పుకున్నాను. అయిపోయింది. అమ్మ వాళ్ళకీ రాసేను. ముందర ఒప్పుకోలేదు. ఎవరు ఒప్పుకుంటారు? తర్వాత వాళ్ళే సర్దుకున్నారు."

"లక్షణంగా ఇంటి దగ్గర చెయ్యకుండా ఎక్కడో చేశా రేమమ్మా? మా కెవరికీ తెలియదు."

"అసలు క థంతా అదే కదా. ఈయనకి ముందరే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. కాకపోతే వాళ్ళిద్దరికీ పొత్తు కుదరలేదు. అప్పటికే విడాకుల దారిలో ఉన్నారు. అ దయ్యాకే అమ్మా వాళ్ళకీ రాశాను. ఆవిడ కేమీ ఇబ్బంది లేదులే. చాలా డబ్బు ఉన్నవాళ్ళు. పిల్లలు ఆవిడ దగ్గరే ఉంటారు. ఇల్లు, కారు అన్నీ ఇచ్చేశారు ఈయన. ఇంకేం కావాలి? ఇం కెందుకు ఆలస్యం అని, అమ్మావాళ్ళని రమ్మని రాశాను. ప్రతి పనికీ ఈయనకి తిరుపతి వెళ్ళడం అలవాటు ముందుగా. ఇదీ అక్కడే కానిచ్చాము. ఇంతకీ సాయంత్రం పార్టీకి మీరందరూ రావాలి తప్పకుండా. అది చెప్పడానికే వచ్చాను. జయ పెళ్ళయిపోయిందట కదా! అమ్మ చెప్పింది. ఎలా ఉంది? ఉత్తరాలు రాస్తోందా? నాకు అడ్రసు ఇవ్వండి. నేను రాస్తాను. కాస్సేపయ్యాక నాన్నగారు వచ్చి మామయ్యగారికి చెప్తారు. వస్తా నేం మరి?" అని హడావుడి పడిపోయింది.

కామాక్షమ్మ తెరుకుస, "పిల్లలు

మామయ్యగారు వస్తారు. నాకు సాయంత్రం ఉపోసం నీకు తెలును కదా. ఇంకా ఉంటావుగా. ఇంకో రోజు వస్తాను. మరి ఉద్యోగం మానేస్తావా?" అంది.

"ఇంకేం ఉద్యోగం? ఇక్కడ ఫాక్టరీ పనులు పూర్తవగానే బొంబాయి వెళ్ళిపోతాం. ఈయన ఉండక్కర్లేదు. అక్కడా చాలా వ్యవహారాలున్నాయి. అక్క డంతా బోల్డు ఫ్రెండ్స్, పార్టీలు అదే కాలక్షేపం. వస్తా మరి" అంటూ వెళ్ళిపోయింది.

"ఎందు కడిగేనా పిచ్చి ప్రశ్న? ఇంకా ఉద్యోగం ఎందుకు అంత గొప్పవాడు అంటుంటే" అంది కామాక్షమ్మ పిల్లలతో తర్వాత.

వెళ్ళిపోతున్న లీలని చూసిన చాలాసేపటి దాకా తేరుకోలేకపోయారు పిల్లలు.

"చాలా వయసు ఉంటుందేమో నమ్మా. బట్టతల అంటున్నాడు వీడు. పిల్లలు అదీ" అంది సుమతి.

కామాక్షమ్మ ఏమీ మాట్లాడలేదు. ఆవిడ ఆలోచనలు వేరే ఉన్నాయి.

సాయంత్రం పార్టీ చాలా జోరుగా సాగుతోంది. బోల్డు కార్లు, జనం వస్తున్నారు. వెళ్తున్నారు. లైట్ల కాంతిలో ఇ ల్లంతా మరింత మెరిసిపోతోంది.

కామాక్షమ్మ ఇంట్లో నుంచే హడావుడి అంతా గమనిస్తోంది. పార్టీ నుంచి వచ్చిన పిల్లలు బట్టలు మార్చుకుంటూ కబుర్లు చెప్పుకుని నవ్వుకుంటున్నారు. సుమతి బయట వరండాలో కుర్చీలో కూర్చున్న తండ్రి పక్కనే అరుగు మీద చతికిలపడింది. పక్క ఇంట్లో సర్దుమణగని ఆర్భాటాన్ని చూస్తోంది. ఆ పిల్ల మనసు ఎక్కడో ఉంది.

"అక్కయ్య పెళ్ళికి అమ్మా నాన్న ఎంతో మొహమాటపడిపోయారు రెండో పెళ్ళివాడు బావ అని. ఎంతో క్లుప్తంగా చేశారు. అక్కయ్య వచ్చినప్పుడు కూడా ఎవ రిళ్ళకీ వెళ్ళలేదు ఏదో తప్పు చేసినదానిలా. అందరూ సిగ్గుతో, చిన్నతనంగా భావించారు. మ రిక్కడ వీళ్ళ ఇంట్లో ఎంత హడావుడి? ఎంత గోల? బావ బాగుంటాడు - అసలు రెండో పెళ్ళి అయినా సరే. ఇక్కడ ఇతను మామయ్యగారి పక్కన ఆయన కన్నా పెద్దగా కనిపిస్తున్నాడు. సూటూ, బూటూ వేశాడు గానీ. అందరికీ గొప్పగా పరిచయం చేస్తున్నాడు - మై సన్ - ఇన్‌లా అంటూ. లీల ఎంతో ఘనకార్యం చేసినదానిలా ఒకటే నవ్వులు, హాస్యం అందరితో కలిసి." ఇవే మాటలు తండ్రితో అంది.

ఆయన బుర్రలోనూ అవే ఆలోచనలు మెదులుతున్నాయి. లోపల కామాక్షమ్మ మనసులోనూ ఇలాంటివే భావాలు.

"ఆ మాలతి వాళ్ళ అమ్మ అయితే మరీ నాన్నా. ఆ రోజు అంతలా విప్పిన చీర కొత్త చీర అవుతుందా అంటూ సాగదీసింది కదా లీల కట్టుకున్న చీర, మెడలో వస్తువులు పట్టి పట్టి చూసి మరీ మురిసిపోయింది. పైగా రెండో పెళ్ళివాడయితే నేం, లక్షణమైనవాడిని చేసుకుంది. కాలు కింద పెట్టక్కర్లేదు అంటూ మహా సంబరపడిపోయింది."

"పిచ్చి తల్లీ డ బ్బమ్మా. అదే అలాంటి పనులు చేస్తుంది. వాళ్ళు ఇష్టపడి చేసుకున్నారు. మనం కష్టపడి చేసుకున్నాము. అందుకే మనం తప్పు చేసినట్టు ముడుచుకుపోతే, వాళ్ళు ఇ ల్లెక్కి వాటుకుంటున్నారు. ముగ్గురు ఆడపిల్లల మీద అంత కన్నా చెయ్యగల దేమిటి అని నన్ను ఈసడించిన వాళ్ళే ఆ పిల్ల కావాలని అలా చేసుకుంది గానీ వాళ్ళు మంచి సంబంధం చెయ్యలే రేమిటి అని సమర్థిస్తారు. అదంతే నమ్మా."

"లీల నాన్నగారు గావంచా కట్టుకుని తిరిగితే ఎంత నిరాడంబరం ఆ మనిషి అంటారు. అదే నేను ఎప్పు డన్నా కట్టుకుంటే ఆ వెధవకి అంతకన్నా గతి లేదు అంటారు. గావంచా ఒక్కటే గానీ కట్టుకున్నవాడి విలువ వేరు. ఇక నువ్వు విప్పిన చీర మాట అన్నావు చూశావా! విప్పిన చీర పట్టు దయితే అది విప్పినదే, కొత్తదో ఎవరికి కావాలి? దానికి ఎగబడినవాళ్ళు దర్జాగానే కనిపిస్తారు. ఎంతయినా పట్టుచీర కదా? అదే నూలు దయితే దానికోసం ఎగబడ్డ మనలాంటివాళ్ళం కక్కుర్తి వాళ్ళమే మరి. డబ్బుంది చూశావా? అది చాలా శక్తి నిస్తుందమ్మా. అ దిచ్చే ధైర్యంతో సిగ్గు, చిన్నతనం వడే అవసరమూ రాదు, అక్కరా లేదు."

తండ్రి మాటలు వింటూ, ఆఖరుగా వెళుతున్న అతిథులని సాగనంపడానికి గేటు దాకా వచ్చిన లీల ఒంటి మీద మెరుస్తున్న చీర, ధగ ధగ మెరుస్తున్న మెడలో నగలు లైట్ల వెలుగులో మరింత మిరుమిట్లు గొలుపుతుంటే అటువైపే చూస్తూ ఉండిపోయిన సుమతి 'దబ్బూ! నీకు సిగ్గు లేదు' అనుకుంది తనలో తనే. ✱


## డిప్లమో అడ్మిషన్ కరస్పాండెన్స్ కోర్సు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఇండియానా అకాడమి ఆఫ్ మేనేజిమెంట్ సైన్సెస్ పట్టభద్రులు మరియు పట్టభద్రులు కాని వారికి 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా అండ్ మేనేజిమెంట్' యొక్క ఆరు నెలల డిప్లమో కోర్సులు నిర్వహిస్తోంది. ఈ క్రింది అన్ని డిప్లమోలు దేశమంతటా మాన్యత కలిగి ఉన్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు.

| పట్టభద్రులకు | పట్టభద్రులు కానివారికి |
|---|---|
| పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లమోలు | డిప్లమోలు |
| 1. మార్కెటింగ్ 2. బిజినెస్ | 1. మార్కెటింగ్ |
| 3. ఫైనాన్షియల్ | 2. బిజినెస్ |
| 4. పర్సనల్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్. | 3. సేల్స్ మేనేజిమెంట్ |
| 5. ప్రొడక్షన్ 6. మెటీరియల్స్. | 4. బ్యాంకింగ్ |
| 7. లేబర్ లాస్ 8. అడ్మినిస్ట్రేటివ్ లా అండ్ మేనేజిమెంట్ | 5. హోటల్ మేనేజిమెంట్ |
| 9. జనరల్ లా | 6. అడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీ |
| అర్హత : పట్టభద్రులు | అర్హత :- ఎస్ఎస్ఎల్‌సి / పియుసి / పిడిసి / హెచ్ఎస్‌సి |

పైన తెల్పిన డిప్లమోలకు పరీక్షలు కరస్పాండెన్స్ ద్వారా నిర్వహించబడును. శ్రేష్ఠమైన స్టడి మెటీరియల్స్ పంపబడును. చాలా తక్కువ రుసుము విధించబడును. ఆసక్తిగల అభ్యర్థులు 'ఉచిత ప్రాస్పెక్టస్' కోసం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, [డిప్లమో అడ్మిషన్] ఇండియానా అకాడమి ఆఫ్ మేనేజిమెంట్ సైన్సెస్, 1083, మెట్టు పాలయం రోడ్, కోయంబత్తూరు- 641 002, తమిళనాడు కు దరఖాస్తు చేయవలెను.



## డ్రాయింగ్ సాంకేతిక పరీక్షలలో శిక్షణ పొందండి
### విద్యార్థులకు ఉద్యోగ అవకాశములు
### ఉచిత శిక్షణా కళాశాల

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖవారి డ్రాయింగ్ పరీక్షకు తెలుగులో 3 నెలలు POSTAL ద్వారా ఉచితశిక్షణ ఇవ్వబడును మొత్తముఖాళీలు 500 SC ST. BC లకు 200 శిక్షణలో చేరినవారికి ప్రింటెడ్ బుక్స్, ఆర్ట్స్ ఉచితముగా POST లో పంపబడును

విద్యార్హత. 7th PASS 8. 9. SSC, INTER, HSC, PUC, MATRIC, SSLC, DEGREE ITI పాస్ లేదా ఫెయిల్ అయినస్త్రీ, పురుషులు అర్హులు

ఉద్యోగములు:- శిక్షణ పొంది ప్రభుత్వపరీక్ష పాసైనవారు DRAWING MASTERS, TRACERS, ARTISTS గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములలోను ప్రైవేట్ సంస్థలలోను దినపత్రికలలో నెలకు రూ॥ 1000/- నుండి 1200/- వరకు పొందవచ్చును మీస్వశక్తిపై ఆర్టిస్టు, పెయింటర్సు, కార్టూనిస్టులుగా స్థిరపడవచ్చును

శిక్షణ పొందగోరు అభ్యర్థులు అప్లికేషన్ వివరములకొరకు 10 రోజులలో రూ॥ 5/- M O ద్వారా పంపి పొందవచ్చును.

✱ ఈ పరీక్షలు SBTET వారు రాష్ట్రములో 38 సెంటర్సులలో ప్రతి సంవత్సరము JUNE లో లోయర్ DECEMBER లో హయ్యర్ నిర్వహించబడును

NOTE: ప్రస్తుతము SSC, INTER, DEGREE PASS లేదా FAIL అయి ఖాళీగా ఉన్నవారికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగము.

ఫోన్: 512

PRINCIPAL: S.V.T.A.T. COLLEGE. [Govt. Regd. & Recognised] Post Box 30 CHILAKALURIPET- 522616.